# ఆడజన్మ

సావిత్రికి పదోయేట పెళ్ళిచేశారు. గొప్పసంబంధమని మూడువేలు కట్నంపోశారు. పెళ్ళికయిదువేలు ఖర్చయింది.

అంతకట్నమూ తీసుకుని అల్లుడు మనుగుడుపులకు కూడా రాలేదు. సావిత్రి రజస్వల అయిందని తెలియగానే, భార్యను తనదగ్గిరదిగబెట్టమన్నాడు. దిగబెట్టారు.

"ఈపెళ్లి చేసి కొంప దివాలాతీసేశావు," అన్నాడు సావిత్రి అన్న తండ్రితో. "డబ్బున్నవాడికి డబ్బిచ్చుకోవటమేమిటి? లేనివాడికిస్తే మనింటకుక్కపడుండును."

"అయిందేదో అయింది. పిల్లను వాళ్ళచేతుల్లో పెట్టాం. వాళ్ళూవాళ్ళూ యేమన్నాకానీ," అన్నాడు తండ్రి. వాళ్ళూవాళ్ళూ యేమవుతారో చూడటానికాయన బతికివుండలేదు.

సావిత్రిమొగుడి అభిరుచులు కొంచెము విపరీతమైనవి. అతను పెళ్ళాన్ని రోజూ ఆరోగ్యముకోసము కొట్టేవాడు. ఇంట్లో తల్లిదండ్రులు అడ్డం వస్తున్నారని భార్యతో వేరేకాపరం పెట్టాడు. అప్పుడతనికి భార్యని బూటుకాలుతో తన్నటానికి మంచి వీలుచిక్కింది.

ఫలానివాడు రోజూ పెళ్ళాన్ని బూటుకాలుతో తంతాడని వూళ్ళోనలుగురూ అనుకున్నారు.

సంఘసంస్కర్తలు, "మగవాడి అహంకారం యింత చేస్తున్నది. ఇటువంటి భర్తలనుగురించి వ్యాసాలు రాసి, ఫిలుములు తీస్తేగాని సంఘం బాగుపడద"న్నారు.

"ఇదంతా ఆర్థిక సమస్యవల్ల యేర్పడుతున్న చిక్కు. ఆడది తిండికీ గుడ్డకీ మగవాడిమీద ఆధారపడ్డాక తన్నినా పడాలి, చంపినాపడాలి, అన్నారు" యథార్థవాదులు—తాము భార్యలనిచూసి వొణికినప్పటికిన్నీ.

"మనం దీనికింత బ్రహ్మాండం చేస్తున్నాంగాని ఆడదానికి మెసోకిజం జాస్తి. వాళ్ళు తన్నులుతినే భర్తల్ని గాని ప్రేమగాచూడరు," అన్నాడొక వైజ్ఞానికుడు.

"సరయిన డ్రగ్గుమాసి రెండు పంచదారమాత్రలు తగిలిస్తే వాడిజబ్బు క్షణంలో కుదురుతుంది." అన్నాడు మావాడు.

మొత్తానికి సావిత్రిని తన్నుతుంటే మొగుడికి అడ్డం వెళ్ళినవారెవరూ లేరు. నామటుకు నేనుకూడా, తంతే తన్నాడుగాని యెందుకు తంతున్నాడో తెలిస్తే బాగుణ్ణనుకున్నాను.

మొగుడుతన్నటం అయింతరవాత వొంటరిగా కూచుని సావిత్రి వేడినీళ్ళతో వొళ్లంతా కాచుకొనేది.

పెళ్ళాన్నితన్నటము అయిపోగానే సావిత్రి మొగుడు యే దొమ్మరగుడిసె అయినా చూసుకోవటానికి ప్రతిరాత్రీ వెళ్ళేవాడు. అతని అభిరుచులు కాస్త వింతగానే వుండేవి.

సావిత్రియెడల కాస్తోకూస్తో ఆర్ద్రిత కనబరచినవాడు మావూరు బాలకవి. చంపుకుతినే మొగుడిభార్య గనక సులభంగా లోబడుతుందని ఆశకలిగి మా బాలకవి

శ్రీ కొడవటిగంటి
కుటుంబరావు

మన సైనికులు సాగిస్తున్న యుద్ధంలో విజయాన్నే మనం వేడుతున్నాం!

ఒకసారికి మరోసారి

ధారాళంగా

హెచ్. ఇ. గవర్నర్ యుద్ధనిధికి

విరాళాలు యిచ్చి

వారిని బలపరచండి

హృదయతంత్రులు "మోహనరాగగీతులు...ఆలపించినవి."

ఏమైనా చలిస్తే భర్త ప్రేమగాచూసే భార్య చలించాలి గాని, మొగుడు చంపుకుతినే భార్య చలించదని బాలకవి యెరగడు. కాని సావిత్రిశరీరం భర్త సంపర్కంవల్ల అనారోగ్యం పొందిందని చూచాయిగా విని మావూరి బాలకవి మోహనరాగ గీతులాలపించటం మాని వియోగ విషాదగీతికలల్ల సాగాడు.

* * *

ఏబుద్ధిన వున్నాడోగాని ఓరోజు సాయంకాలం సావిత్రిమొగుడు చచ్చి వూరుకున్నాడు. అతనుచేసిన తెలివిగల పనుల్లో అదొకటని చెప్పాలి.

ఆరోజునించీ సావిత్రి వొళ్లు కాచుకోలేదు. కాని వైజ్ఞానికుడితియరీ ప్రకారము కామజ్వరముతో బాధపడ సాగివుంటుంది.

బావమరిదిపోగానే సావిత్రి అన్నవచ్చాడు. మొగుడు వదిలిపోయినందుకు చెల్లెల్ని అభినందించాడు. తనంత అన్నవుండగా చెల్లెలికేమీ భయంలేదన్నాడు.

సావిత్రి అన్నగారింటచేరింది. వొదినగారు దాసీదానికి అయిదురోజులజీతం యెగ్గొట్టి పంపించేసింది. పాపం ఆవిడకి గుండెజబ్బు, యేపనీ చెయ్యలేదు. పెళ్లాన్ని నెత్తినపెట్టుకు వూరేగుతాడని సావిత్రి అన్నను యెగతాళీ చేస్తారుగాని, ఆవిడగుండె జబ్బుగుర్తించరు.

వెనక వాళ్లతమ్ముడి పెళ్లప్పుడు సావిత్రి వొదిన గారికి నూటపదహార్లివ్వక పొయ్యేటప్పటికి ఆవిడగుండె చాలా గడబిడచేసి యిచ్చిందాకా కుదటపల్లేదు. అంచేత ఆవిడకి గుండెజబ్బూలేదు, యేమీలేదనటం అన్యాయం.

సావిత్రి కాస్త అంటుతోమి, బట్టలుతికి, పిల్లలకు నీళ్లుపోసి, కొద్దిగా మడికట్టుకుని, నాలుగు మెతుకులు పొయిమీద పెట్టి, కాస్తయెంగిళ్లూ అవీ బాగుచేసి, యెప్పు

డన్నా వారానికోసారి యింటిల్లిపాదికీ తలంట్లూ అవీ పోసి, పక్కలూ అవీవేసి, వంటిల్లూ అది కడుక్కుంటే మిగతాపనంతా సావిత్రి వొదినగారే చూసుకునేది.

ఎంతచెడ్డా లౌకికుడు గనక సావిత్రి అన్నగారు మంచి వుపాయము ఆలోచించాడు. సావిత్రికి మనోవర్తి రావలసివుంది. దానికోసం దావావెయ్యాలి దస్కతు పెట్టమన్నాడు. ఉత్తరంరాస్తే చాలదా, దావా దేని కన్నది సావిత్రి. ఆడదానివి నీకీవిషయాలు తెలియవులే దస్కతు పెట్టమన్నాడు అన్న. సావిత్రి సంతకంచేసింది.

లాయరు నోటీసుకు సమాధానంలేదు. తప్పని సరిగా సావిత్రిఅన్న అంతలావుశరీరాన్ని కోర్టుకెక్కించ వలసి వచ్చింది.

సావిత్రిమరిది పరిగెత్తుకుంటూ వచ్చాడు. అతను అన్నగారల్లే దుర్మార్గుడుకాడు, యీమృష్టి మనోవర్తి కోసము కోర్టుకుపోవద్దని వొదినెగార్ని ప్రాధేయపడ్డాడు. తన పరువుప్రతిష్టలు ఆలోచించమన్నాడు.

అయితే మనోవర్తికాగితంరాసి రిజిస్టరుచేసి యిమ్మన్నాడు సావిత్రి అన్న. పాతికరూపాయల భాగ్యానికి కాగితముకూడా దేనికి, రిజిస్టరుదండుగన్నాడు సావిత్రి మరిది.

ఏం పాతికరూపాయలు, నూటయాభైకి తక్కువయితే వొప్పేదిలేదన్నాడు సావిత్రి అన్న.

పోనీ యిరవైఆరు చేసుకోమన్నాడు మరిది. నూట నలభైతొమ్మిదికూడా చేసుకోనన్నాడు అన్న.

'తేరగా కూర్చోబెట్టి ఒకరికొకరు తిండి యెందుకు పెడతారు?' అన్నాడు అన్న.

'సొంత చెల్లెలిమీద అంత కాఠిన్యంకూడదు,' అన్నాడు మరిది.

'వేలకువేలు కట్నాలుపోసి చెల్లెళ్లను వదిలించుకోవటం భరించటానికేనా?' అన్నాడన్న. అంతేకాక తనచెల్లెలు యింకా 81 సంవత్సరము బతకొచ్చుననీ, అంతకాలమూ భరించటానికి తనకు సరిగా పన్నెండు వేల నూటయాభై రూపాయలవుతుందనీ తనదగ్గిర అంత డబ్బులేదనీ కూడా రుజువుచేశాడు.

ఏటా యిరవైఏడు రూపాయిలన్నరకన్న యిచ్చే శక్తి తనవద్దలేదనీ, డబ్బు కరువొచ్చినప్పటినించీ తన పొలముమీద రెండువేల అయిదొందలకంటె రావటము లేదనీ, అన్నగారు చచ్చినందువల్ల తనకు కలిగినలాభము ఆయన చచ్చాడన్నదుఃఖములో యెక్కడా కనిపించటము లేదనీ, తనరక్తము పిండితాగటము తన వొదినెగారికి


***Best with cheapest !***

***Best with cheapest !!***



All kinds of Musical Instruments

మావద్ద అన్నిరకాలలో పారీస్ స్టెయిల్

"హార్మోనియ" మున్నూ, ఫిడేలున్నూ దొరకును.

మంచి శబ్దముతో, చాలాకాలము వుపయోగపడును.

ధరలు చాలా తక్కువ! ఒకసారి ఆర్డరుచేసి చూడండి!!

1. సింగిల్ రీడ్ 4, స్టాపర్ హార్మోనియం ఒకటికి రు. 35-0-0
2. డబుల్ రీడ్ హార్మోనియం (బాస్ & ఫ్లూట్, బాస్ & మేల్) రు. 55-0-0
3. ట్రిబిల్ రీడ్ హార్మోనియం (బాస్ & ఫ్లూట్ & మేల్) స్టికోకీస్ రు. 95-0-0
4. కేసరీల్ పారీస్ లెగ్ హార్మోనియం కూడా దొరకును.

**Sri HARY & CO.,** 180, China Bazaar Road, (Near Mysore Cafe) MADRAS.



తెరలో...



ఇంట్లో....

భావ్యము కాదనీ మరీ మరీ చెప్పారన్నాడు, ప్రాథేయపడ్డాడు, యేడిచాడు; తనకు వొదినెగారొకటీ తనతల్లి మరొకటీ కాదన్నాడు. మనుష్యులకు కావలసింది ఆపేక్ష అంతఃకరణలుగాని వెధవడబ్బు కాదన్నాడు.

ఓపూటల్లా గుంజాటన పడ్డమీదట మరిది వొదినె గారికి యేటా యాభైరూపాయలిచ్చేటట్టూ, వాటితో ఆవిడ తిండిఖర్చూ, బట్టలఖర్చూ, యింటిఖర్చూ గడుపుకునేటట్టూ స్థిరపడింది.

పత్రము రాసిమ్మన్నాడు సావిత్రి అన్న.

దానికేం తొందర లెమ్మన్నాడు మరిది. తనకొంప గుండమయిందన్నాడు. యాభైరూపాయలంటే తనయింటి బియ్యపుఖర్చన్నాడు, ఒక ఆవుఖరీదన్నాడు, యింటిల్లిపాటికీ గుడ్డలకయ్యే మొత్తమన్నాడు, యేటా వేసుకునే వూరగాయలకయ్యే దానికి మూడింతలన్నాడు.

సావిత్రి తనకీడబ్బు అవసరము లేదన్నది.

అన్నకోపమువచ్చింది.

'డబ్బులేకుండా యెట్లా జరుగుతుంది?' అన్నాడన్న.

సావిత్రి చాలాయేళ్ళకు చిరునవ్వు నవ్వింది.

'జరిగే వుపాయము నాకు తెలుసు,' నన్నది.

అన్నకోపమువచ్చి యేమేమిటో పేలాడు. సావిత్రి చలించలేదు. మరిది మొహము వికసించింది. తన వొదినెగారంటిది ప్రపంచములో యెక్కడా లేదన్నాడు.

* * *

ఆరోజు రాత్రి సావిత్రి బావిలో గెంతేసింది. కొంతసేపు శరీరము చాలా బాధపడింది. కాని ఆమె మనస్సు పొందిన ఆనందం మటుకు తగ్గలేదు.

ఈవార్త మర్నాడు వూరంతా పాక్కి నలుగురూ శవంచుట్టూ మూగినప్పుడు ఒక తెలివిగలవాడు, 'అన్ని చావుల్లోకీ జలమరణం చాలా సులభమయినది,' అని అనుభవముమీద చెప్పినట్టు చెప్పాడు.